సాక్షి
మహబూబాబాద్
బుధవారం । 28 । ఆగస్టు । 2024



బీసీఐ అనుమతి నిరాకరణ - 8లో▸

యూనివర్సిటీ అధికారులు గ్యారంటీ డిపాజిట్ ఫీజు చెల్లించకపోవడంతో ఈఏడాది లా కాలేజీకి బీసీఐ అనుమతి నిరాకరించింది.



హైడ్రా పేరిట హైడ్రామా..

రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట హైడ్రామా చేస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

వైద్యకళాశాలలో మొదటి అడ్మిషన్



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల మూడో బ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన అనుభూతి బ్రాహ్మణి మంగళవారం మొదటి అడ్మిషన్ పొందారు. ఆల్ ఇండియా కోటాలో జీఎంసీ మహబూబాబాద్‌లో మొదటి విద్యార్థిగా కళాశాలలో సీటు పొంది కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లకావత్ వెంకట్‌కు రిపోర్టు చేశారు.

డీఈఓగా రాజేశ్వర్



మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ అధికారిగా వి.రాజేశ్వర్ నియమితులయ్యారు. మహబూబాబాద్ డీఈఓగా పనిచేసిన పి.రామారావు బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లారు. ఈనేపథ్యంలో డీఈఓ కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్‌కు ఇన్‌చార్జ్ డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ.నర్సింహారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విలువలతో కూడిన విద్యనందించాలి



నెల్లికుదురు: కళాశాల విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సీహెచ్ మదార్ అధ్యాపకులకు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించి కళాశాలలోని రికార్డులను పరిశీలించారు. రికార్డు అసిస్టెంట్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాపక బృందంతో సమావేశం ఏర్పాటు చేసి సలహాలు సూచనలు అందించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దు



తొర్రూరు రూరల్: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్ సూచించారు. మండలంలోని వెంకటాపురం, కేవులతండాలో విషజ్వరంతో మృతిచెందిన లచ్చిరాంనాయక్ ఇంటి పరిసరాలను మంగళవారం డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. తండాలో పర్యటించి, జ్వరాలపై ఆరా తీసి, మాట్లాడారు. ప్రస్తుతం జ్వరాలు, జలుబు, దగ్గు వ్యాప్తి చెందుతున్నాయని, ఆరోగ్య సమస్య ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రతిరోజూ గ్రామాలు, తండాలు, కాలనీలను సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. సమస్య ఉంటే వైద్యం అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యలిత, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'అధైర్యపడొద్దు.. రుణమాఫీ చేస్తాం'

కురవి: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని, అధైర్య పడొద్దని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ రైతులకు భరోసా కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కురవి, సీరోలు మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను ఆయన అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేశామని తెలిపారు. అర్హులైన అందరి రైతులకు రుణమాఫీ వస్తుందని వివరించారు. కురవిలోని ప్రాథమిక పాఠశాలలో అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఆయన పంపిణీ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు గంధసిరి జ్యోతిబసు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శారద, సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వీరబాబు, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, బండి వెంకటరెడ్డి, రవీందర్‌రెడ్డి, నారాయణ రాజేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఆధ్యాత్మికం

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో సాగిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన

- రామప్ప, కోటగుళ్ల సందర్శన అదృష్టమన్న వర్మ
- ఆదివాసులు, గిరిజనుల పథకాలపై సమీక్ష.. చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచన
- రచయితలు, కళాకారులకు అభినందనలు.. మంత్రి సీతక్కకు ప్రశంస
- లక్నవరంలో రాత్రి బస.. నేడు, రేపు కొనసాగనున్న టూర్



ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని రామప్ప ఆలయం వద్ద గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/ములుగు/వెంకటాపురం(ఎం)/భూపాలపల్లి/గోవిందరావుపేట : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పర్యటన ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు మంగళవారం మధ్యాహ్నం రోడ్డుమార్గాన ములుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పి.శబరీష్, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్‌లు శ్రీజ, మహేందర్ జీ తదితరులు పూల మొక్కలు అందజేశారు. సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో మహిళలు, చిన్నారులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. 11.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సుమారు ఏడున్నర గంటలపాటు ఆయన పర్యటన సాగగా, లక్నవరం ఐలాండ్‌లోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన రాత్రి బస చేశారు.

గిరిజన, ఆదివాసీ పథకాల అమలుపై సమీక్ష...

గవర్నర్ వర్మ ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ, గిరిజనుల కోసం అమలవుతున్న పథకాలపై ఆరా తీసిన గవర్నర్.. ఆయా వర్గాల అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లాలో వినూత్నంగా కంటైనర్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం పట్ల మంత్రి సీతక్కను ప్రత్యేకంగా అభినందించారు.

గవర్నర్ అభినందనలు..

ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గవర్నర్ వర్మ జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ, అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ అయ్యారు. మధ్యాహ్న భోజనం వారితోనే చేశారు. జిల్లాకు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావడంపై అభినందనలు తెలిపారు.

రామప్పలో పూజలు..

కలెక్టరేట్‌లో సమావేశం ముగించుకున్న గవర్నర్ నేరుగా రామప్ప ఆలయానికి చేరుకోగా, ఆలయ వేద పండితులు ఘన స్వాగతం పలికారు. రామలింగేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని శిల్పాలను తడిమి చూశారు. నీటిపై తేలియాడే ఇటుకను ప్రత్యక్షంగా ప్రొఫెసర్ పాండురంగారావు వివరించారు. ఆలయ చరిత్ర, శిల్ప సంపద విశిష్టతను ఆలయ గైడ్ విజయకుమార్ వివరించారు. ఈ సందర్భంగా జిష్ణుదేవ్ వర్మ మీడియాతో మాట్లాడుతూ రామప్ప దేవాలయం నిర్మాణం మహా అద్భుతమని, శిల్ప సంపద రమణీయమని కితాబిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ బలరాం నాయక్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా, డీఎఫ్‌ఓ రాహుల్ కిషన్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోటగుళ్లలో..



కోటగుళ్లలో శిల్పాన్ని పరిశీలిస్తున్న గవర్నర్

రామప్పనుంచి గవర్నర్.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ల గణపేశ్వరాలయానికి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే ఘన స్వాగతం పలికారు. తవ్వకాల్లో బయటపడ్డ శిల్పాలను గవర్నర్ పరిశీలించారు. కాకతీయుల వైభవాన్ని చాటే గొప్ప కట్టడం గణపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పాలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని తెలిపారు. అక్కడినుంచి గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సుకు చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీసులు భారీ భద్రత, బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు, రేపు కూడా గవర్నర్ పర్యటన వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో కొనసాగనుంది.

మేడారానికి జాతీయహోదా కల్పించేలా చూడాలి: మంత్రి సీతక్క



తొలిసారి జిల్లా పర్యటనకు గవర్నర్ రావడం పట్ల జిల్లా ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపిన మంత్రి ధనసరి సీతక్క.. మేడారం మహాజాతరను జాతీయ పండుగగా గుర్తించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ములుగు జిల్లా రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తరణ ఉందని, 30 శాతం మంది ఆదివాసీలు, గిరిజన ప్రజలు ఈ జిల్లాలో నివసిస్తున్నారన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో నివసిస్తూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.



రామప్ప ఆలయంలో రామలింగేశ్వరుడికి పూజలు చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క



లక్నవరంలో తీగల బ్రిడ్జిపై నడుస్తూ సరస్సు అందాలను వీక్షిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో మంత్రి సీతక్క, తదితరులు

ఇంటికొకరికి జ్వరం





జ్వరంతో మంచం పట్టిన పాతదుబ్బతండా వాసి, తండాలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

- పాతదుబ్బతండాలో మంచం పట్టిన గిరిజనులు
- వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినా తగ్గని జ్వరాలు

డోర్నకల్: మండలంలోని పాతదుబ్బతండాలో గిరిజనులు జ్వరాలతో మంచం పట్టారు. గత పది రోజులుగా ఇంటికొకరు జ్వరాల బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన జ్వరం, ఒంటి నొప్పులతో బాధ పడుతూ ఆర్ఎంపీలు, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి చికిత్స పొందుతున్నారు. పది రోజుల క్రితం వరకు కొత్తదుబ్బతండా వాసులు జ్వరాల బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకోగా.. కొద్ది రోజులుగా సమీపంలోని పాతదుబ్బతండా వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. తండాలో నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నా జ్వరాలు తగ్గడం లేదు. పలుమార్లు తండాలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, మందులు పంపిణీ చేశారు. జ్వరాలు తగ్గినా తీవ్రమైన ఒంటి నొప్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండావాసులు వాపోతున్నా రు. పంచాయతీ కార్యదర్శి రజిత మాట్లాడుతూ.. త్వరాలు తగ్గుముఖం పట్టాయని, ప్రతీ రోజూ బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ దోమల మందు పిచికారీ, రాత్రివేళ ఫాగింగ్ చేయిస్తున్నామని తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- డాక్టర్ సుధీర్‌రెడ్డి



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యులు

కురవి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కీటక జనిత వ్యాధుల నియంత్రణ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ సుధీర్‌రెడ్డి సూచించారు. కురవి పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లను పరిశీలించారు. వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, జ్వరపీడితులకు మలేరియా, డెంగీ కిట్లతో రక్తపరీక్ష చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 11మంది విద్యార్థులకు జ్వరం ఉన్నట్లు నిర్ధారించారు. పీహెచ్‌సీ డాక్టర్ విరాజిత, సబ్ యూనిట్ ఆఫీసర్ ఒబిలిశెట్టి రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, హెల్త్ సూపర్‌వైజర్ రాజకుమారి, ఏఎన్‌ఎంలు నసీమా, పద్మ, ఆశా కార్యకర్తలు విజయ, జ్యోతి పాల్గొన్నారు.

ఆ శవానికి.. బస్టాండే ఇల్లు..

- ఒంటరిగా జీవించిన ఓ వ్యక్తి జ్వరంతో మృతి
- తండావాసులు, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



బస్టాండ్‌లో ఉంచిన మల్లయ్య మృతదేహం

కేసముద్రం: అందరూ ఉన్నా.. అతను అనాథ శవమయ్యాడు..గూడు లేకపోవడంతో బస్టాండే ఆ శవానికి ఇల్లయింది. మానవత్వంతో స్పందించిన తండావాసులు, లయన్స్‌క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి, ఆ మృతదేహానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. హృదయాలను కలిచివేసే ఈ ఘటన మండలంలోని బ్రహ్మంగారితండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి సమీపంలోని జమ్మిగుట్టకు చెందిన ఓర్సు మల్లయ్య(70) కుటుంబంతో 35 ఏళ్ల క్రితం బ్రహ్మంగారితండాకు వచ్చారు. కుటుంబ తగాదాతో భార్య పిల్లలతో కలిసి వెళ్లిపోయింది. అప్పటినుంచి మల్లయ్య ఒంటరిగా కూలీనాలి పనులు చేసుకుంటూ తండాలోనే ఉంటూ.. సోమవారం రాత్రి తీవ్రజ్వరంతో చనిపోయాడు. తండావాసులు మల్లయ్య మృతదేహాన్ని దగ్గరలో ఉన్న కేసముద్రంస్టేషన్ బస్టాండ్‌కు తరలించారు. స్థానిక లయన్స్‌క్లబ్ సభ్యులు బాడిఫ్రీజర్‌ను ఏర్పాటు చేసి, మృతదేహాన్ని భద్రపరిచారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో భార్య, పిల్లలు చేరుకున్నారు. కానీ, దహన సంస్కారాలకు డబ్బులు లేకపోవడంతో, తండావాసులే మానవత్వంతో స్పందించి, ఇంటింటికీ తోచినసాయం అందించారు. ఈ మేరకు అంత్యక్రియలు పూర్తి చేశారు.

బీఆర్ఎస్ పాలనలో భూముల అన్యాక్రాంతం

- మతిభ్రమించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్ రావు
- విలేకరుల సమావేశంలో ఎంపీ బలరాంనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాంనాయక్, పక్కన ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, ఆ భూములను స్వాధీనం చేసుకుని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేస్తే తప్పేంటన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పరుష పదజాలంతో దూషించిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన చెరువులు, భూముల కబ్జాలు, భూదందాలు, అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డికి నివేదిక ఇచ్చామని, వారి అవినీతిని కక్కించే వరకు ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. హైడ్రా మాదిరిగా మహబూబాబాద్ ప్రాంతంలో కూడా భూఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పనితీరు చూసి రవీందర్‌రావు మతిభ్రమించి మాట్లాడుతున్నాడని అన్నారు. భూ దందా, ఇసుక దందా, బెల్లం వ్యాపారం చేసిన మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, రెడ్యా నాయక్‌పై ఆనాడు ఎందుకు కొట్లాడలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలం ఉంటే గురుకుల క్రీడా ఆశ్రమ పాఠశాల నెలకొల్పేందుకు కృషి చేయడమే గాకుండా 500 పడకల ఆస్పత్రి, ఈఎస్ఐ బ్రాంచి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉదయ్ చందర్, కత్తి స్వామి, ప్రభాకర్, హారుణ్, సురేందర్, యాదవరెడ్డి, దస్రునాయక్, శ్రీను, ప్రవీణ్, స్వర్ణలత, విజయ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులు త్వరగా పూర్తి చేయండి

గూడూరు: మండలంలో 365జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలని ఎంపీ పోరిక బలరాంనాయక్ ఫోన్‌లో సంబంధిత అధికారికి తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి, రమేశ్‌నాయక్‌తో కలిసి ఎన్‌హెచ్ పనులను పరిశీలించారు.

వ్యాధుల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

గంగారం : విద్యార్థులు విషజ్వరాలు, సీజనల్ వ్యాధుల బారినపడకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మండలంలోని పీహెచ్‌సీ, కస్తూర్బా బాలికల విద్యాలయం, ఆశ్రమోన్నత పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై ఓపీ పేషెంట్లతో మాట్లాడి తెలుసుకున్నారు. 24గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. హాస్పటల్‌లోని ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఇన్ పేషెంట్స్ వార్డులు, ఫార్మసీలను పరిశీలించారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. తాగునీరు, విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ రాము, పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యం ప్రమాదకరం

వ్యాపిస్తున్న వైరల్ జ్వరాలు

- అనారోగ్య సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు



'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

నెహ్రూసెంటర్: ప్రస్తుతం దోమలు, అపరిశుభ్రత, మురుగునీటి నిల్వలతో వైరల్, డెంగీ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఈనేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని, జ్వరం తగ్గకుంటే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు సూచించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమంలో ఆయన.. డాక్టర్లు అయేషా, సుధాకర్, అనిల్‌కుమార్‌తో కలిసి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

ప్రశ్న: జ్వరం వచ్చి తగ్గాక కీళ్లు, ఒంటి నొప్పులు వస్తున్నాయి?

– ఉపేందర్ గూడూరు, సందీప్‌కుమార్ పెద్దవంగర, బానోత్ దామోదర్ మరిపెడ బంగ్లా, కొమ్ము రాహుల్ కేసముద్రం, మంద వినయ్ కేసముద్రం, గండి ఉప్పలయ్య చిన్నగూడూరు, సాగర్ మన్నెగూడెం, హరినాయక్ వీరారం, ముని మహబూబాబాద్

జవాబు: వైరల్ జ్వరాల కారణంగా జ్వరం తగ్గాక నొప్పులు వస్తున్నాయి. భయపడాల్సిన అవసరం లేదు. పౌష్టికాహారంతోపాటు విశ్రాంతి తీసుకోవాలి. ఇబ్బంది ఎక్కువైతే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. నీళ్లు ఎక్కువగా తీసుకుంటూ డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. జ్వరం తగ్గి మళ్లీ వస్తే వెంటనే టెస్టులు చేయించుకుని మందులు వాడితే తగ్గిపోతుంది.

ప్రశ్న: గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి?

– మధుకర్‌రెడ్డి వావిలాల, గణేశ్ బయ్యారం, బోడ బాబు అబ్బాయిపాలెం, సిరిపురం వీరన్న మహబూబాబాద్

జవాబు: అవసరం అయిన చోట వైద్యశిబిరాలు ఏర్పాటు చేసేందుకు వైద్యారోగ్యశాఖకు తెలియజేస్తాం. వైరల్ ఫీవర్స్ అన్ని చోట్లా ఎక్కువగానే వ్యాప్తి చెందుతున్నాయి. పీహెచ్‌సీలో అయిన చికిత్స చేయించుకోవాలి.

ప్రశ్న: గార్లలో డాక్టర్లు రాత్రిపూట అందుబాటులో ఉండడం లేదు. మందులు ఇవ్వడం లేదు. టెస్టులు చేయడం లేదు?

– సుమాంజలి గార్ల, రంజాన్ అంబేడ్కర్‌నగర్, రవీందర్ గార్ల

జవాబు: వైద్యారోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అత్యవసర వేళల్లో జీజీహెచ్‌లో అన్ని రకాల వైద్య సేవలను పొందవచ్చు.

ప్రశ్న: వారం రోజులవుతున్నా జ్వరం తగ్గడం లేదు?

– భారతి మరిపెడ, మాలోత్ హరికిషన్ మహబూబాబాద్, శైలజ గూడూరు

జవాబు: విషజ్వరాలు వస్తున్నందున నిర్లక్ష్యం చేయొద్దు. సమీపంలోని పీహెచ్‌సీలో చికిత్స చేయించుకోండి. లేదా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్సతోపాటు అన్నిరకాల పరీక్షల చేస్తారు.

ప్రశ్న: డెంగీ కేసులు పెరుగుతున్నా.. పట్టించుకోవడం లేదు? ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి.

– రాజేశ్ తొర్రూర్, ఎర్రం రాజు కంఠాయపాలెం, మంగళంపల్లి శ్రీనివాస్ తొర్రూర్ మాజీ జెడ్పీటీసీ

జవాబు: డెంగీ నిర్ధారణ అయితే వెంటనే చికిత్స ప్రారంభించాలి. జ్వరం ఎక్కువ రోజులు ఉన్నా నిర్లక్ష్యం చేయొద్దు. పీహెచ్‌సీలో సంప్రదించాలి లేదా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలను పొందాలి. కలెక్టర్, డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకెళ్తాం.

ప్రశ్న: నడిచినప్పుడు కుడికాలు ఎక్కువగా నొప్పి వస్తుంది? బేవరింపులతో ఇబ్బంది అవుతుంది, అల్సర్ సమస్య ఉంది?

– ఎర్రమల్ల సోమయ్య, రమేశ్ రాంచంద్రాపురం కాలనీ

జవాబు: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్థో వైద్యులు అందుబాటులో ఉన్నారు. సంప్రదించి చికిత్సచేయించుకోండి.

ప్రశ్న: జ్వరం, జలుబు, దగ్గు తగ్గడం లేదు?

– వీరయ్య రామచంద్రాపురం.

జవాబు: వాతావరణ మార్పుల కారణంగా అందరిలో ఇలాంటి లక్షణాలే ఉంటున్నాయి. వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అవసరమైన మేరకు టెస్టులు చేయించుకోవాలి.

ప్రశ్న: జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి?

– బోడ రమేశ్, మన్నెగూడెం

జవాబు: అవగాహన కార్యక్రమాలు, క్యాంపులు ఏర్పాటు చేసేలా వైద్యారోగ్యశాఖ అధికారులకు తెలియజేస్తాం. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లండి.

ప్రశ్న: పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు? నీరు నిల్వ ఉండి దోమలు ఎక్కువ అయ్యాయి.

– వేణుగోపాల్ డోర్నకల్, శ్రీనివాస్ తొర్రూర్

జవాబు: మున్సిపాలిటీ, జీపీ అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణకు ఫాగింగ్, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాల్సి ఉంటుంది. సిబ్బందికి సమాచారం చేరవేస్తాం. మురుగు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి.

ప్రశ్న: తొర్రూర్‌లో జ్వరాలతో చనిపోతున్నా పట్టించుకోవడం లేదు.? నీరు అపరిశుభ్రంగా వస్తుంది..

– యాకేందర్ తొర్రూర్, జాటోత్ ఉపేందర్ దుబ్బతండా

జవాబు: వైద్యారోగ్యశాఖ అధికారులకు క్యాంపు ఏర్పాటు చేసేలా సమాచారం ఇస్తాం. నీటి విషయమై మున్సిపాలిటీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేయండి.

ప్రశ్న: దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వలేకుండా చూడాలి?

– వంగాల సోమన్న కంఠాయపాలెం.

జవాబు: వ్యాధులకు మూలం దోమలే. జాగ్రత్తలు పాటించాలి. మున్సిపాలిటీ అధికారులకు సమస్యలను విన్నవించండి.

క్లుప్తంగా

1న జిల్లాస్థాయి చెస్‌ పోటీలు

వరంగల్‌ స్పోర్ట్స్‌ : ఉమ్మడి జిల్లా స్థాయి అండర్‌–11 బాలబాలికలకు సెప్టెంబర్‌ 1వ తేదీన చెస్‌ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు వరంగల్‌ జిల్లా చదరంగ సమాఖ్య కార్యదర్శి పి.కన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్‌ గార్డెన్‌ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించే ఈ పోటీలకు 2013, జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి చెస్‌ పోటీలకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. క్రీడాకారులు తప్పనిసరిగా వెంట చెస్‌ బోర్డు తీసుకుని రావాలని, ఇతర వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

1న సబ్‌ జూనియర్స్‌ ఖోఖో ఎంపికలు

వరంగల్‌ స్పోర్ట్స్‌ : ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌ జూనియర్స్‌ ఖోఖో ఎంపిక పోటీలు సెప్టెంబర్‌ 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు వరంగల్‌ ఖోఖో అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట శ్యాంప్రసాద్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వివరాలకు 98492 10746, 79892 03044 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

31 వరకు గడువు పెంపు

హన్మకొండ కల్చరల్‌ : వరంగల్‌ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2024–25 సంవత్సరానికి ఆలస్య రుసుముతో ఎంఏ తెలుగు రెగ్యులర్‌ కోర్సు ప్రవేశానికి ఈ నెల 24తో గడువు ముగిసింది. కాగా విద్యార్థుల విజ్ఞప్తుల మేరకు రూ.100ల ఆలస్య రుసుముతో ఈ నెల చివరి వరకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి ప్రొఫెసర్‌ భూక్య బాబురావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

ప్రతీ జిల్లాలో హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలి



హన్మకొండ : హైడ్రా తరహా ప్రత్యేక వ్యవస్థను రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్‌ పల్లెపాడు దామోదర్‌ అన్నారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లో జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో దామోదర్‌ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలులోకి తెచ్చిన హైడ్రా వ్యవస్థను స్వాగతిస్తున్నామని, హైడ్రా నిష్పక్షపాతంగా అక్రమ కట్టడాలను కూల్చివేయడాన్ని వినియోగదారుల సంఘాల పక్షాన అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ వరంగల్‌, హనుమకొండలోని దేవాలయ భూముల పరిరక్షణను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. పద్మాక్షి, సిద్ధేశ్వరస్వామి దేవాలయ భూములతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్‌ 890/బీలో ఉన్న 56.19 ఎకరాల భూమి కబ్జా అవుతుందని, భద్రకాళీ చెరువులోని 10 సర్వే నంబర్‌లోని భూమి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం వల్ల అక్రమ కబ్జాలు జరుగుతున్నాయన్నారు.న్యాయవాదులు హైమవతి, శ్రీదేవి, సంఘం సభ్యులు రావుల రంజిత్‌ కుమార్‌, కవిరాజు, ఇందిర, జ్యోత్స్న, సతీష్‌ పాల్గొన్నారు.

బీసీఐ అనుమతి నిరాకరణ

ఫీజు చెల్లింపులో వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం?

- వెబ్‌ ఆప్షన్‌లో కనిపించని కేయూ న్యాయ కళాశాల పేరు
- ఈ ఏడాది అభ్యర్థులకు తప్పని నిరాశ

కేయూ క్యాంపస్‌ : నాలుగు దశాబ్దాల క్రితం కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలను(లా కాలేజీ) హనుమకొండలోని సుబేదారిలో ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు న్యాయ కళాశాల అనేక సమస్యలతో సతమతమవుతోంది .యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యంతో సకాలంలో గ్యారంటీ డిపాజిట్‌ ఫీజు చెల్లించడంలో జాప్యం జరిగింది. అంతేగాకుండా రెగ్యులర్‌ అధ్యాపకుల కొరత.. 14మంది పార్ట్‌టైం అధ్యాపకులు ఉన్నారు. అంతేగాకుండా మూట్‌ కోర్టు ఉన్నా కూడా వినియోగించుకునే స్థితి లేకపోవడంతో బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (బీసీఐ) యూనివర్సిటీ లా కాలేజీకి ఈ విద్యాసంవత్సరం (2024–25)లో ప్రవేశాలకు అప్లియేషన్‌ అనుమతి ఇవ్వలేదు. అలాగే బీసీఐ విడుదల చేసిన లా కళాశాలల జాబితాలో కేయూ లా కాలేజీ పేరు లేదు. దీంతో యూనివర్సిటీ లా కాలేజీలో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులకు నిరాశే ఎదురైంది.

వర్సిటీ అధికారుల నిర్లక్ష్యమేనా?

మిగతా లా కాలేజీల్లాగానే కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాలకు కూడా బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా నిబంధనలు వర్తిస్తాయి. 2024–25విద్యాసంవత్సరంలో లాసెట్‌ ప్రవేశాలకు సంబంధించి కూడా బార్‌కౌన్సిల్‌ ఇండియా నుంచి అప్లియేషన్‌ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు ప్రతికోర్సుకు ఫీజు రూ.3లక్షలు చొప్పున మూడేళ్ల లా కోర్సు, ఐదేళ్ల లా కోర్సుకు కలిపి రూ.6లక్షలు, తనిఖీ ఫీజు రూ.50వేలు మొత్తం చెల్లించారు. అయితే గ్యారంటీ డిపాజిట్‌గా(కాషన్‌ డిపాజిట్‌) కూడా రెండు కోర్సులు కలిపి రూ.10 లక్షలు చెల్లించాల్సిండగా ఇది ప్రభుత్వ యూనివర్సిటీ లా కాలేజీ కదా అని ఆ ఫీజును బీసీఐకి చెల్లించడంలో యూనివర్సిటీ అధికారులు కొంత జాప్యం చేశారు. ఈ డిపాజిట్‌ ఫీజును ఇటీవలనే బీసీఐకి చెల్లించారు. ఆలస్యంగా చెల్లించినట్లు కేయూ రిజిస్ట్రార్‌ పి.మల్లారెడ్డి మంగళవారం ధ్రువీకరించారు. బార్‌ కౌన్సిల్‌ అనుమతినిస్తూ విడుదల చేసిన లా కళాశాలల జాబితాలో కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ పేరు లేకపోవడంతో యూనివర్సిటీ అధికారులు కంగుతిన్నారు. రెగ్యులర్‌ అధ్యాపకులు లేరని అనుమతి ఇవ్వలేదని సమాచారం అందిందని కేయూ రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి అంటున్నారు.



కాకతీయ యూనివర్సిటీ లా కాలేజీ భవనం

యూనివర్సిటీ లా కాలేజీలో బీసీఐ తనిఖీ

బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (బీసీఐ) నుంచి ఐదుగురు సభ్యుల బృందం ఈ ఏడాది జూలై 22న హనుమకొండలోని యూనివర్సిటీ లా కాలేజీని సందర్శించి తనిఖీ చేశారు. యూనివర్సిటీ లా కాలేజీలో ఏడు అధ్యాపక పోస్టులు ఉండగా ప్రస్తుతం రెగ్యులర్‌ అధ్యాపకులలో ఒకరు ప్రొఫెసర్‌, మరొకరు అసోసియేట్‌ ప్రొఫెసర్‌, ఇంకొకరు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఉన్నారు. 14మంది పార్ట్‌టైం అధ్యాపకులు పనిచేస్తున్నారు. బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా నియమ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా లా కాలేజీలోని సదుపాయాలను తనిఖీ చేసినట్లు సమాచారం. మరోవైపు గ్యారంటీ డిపాజిట్‌ ఫీజు ఆలస్యంగా చెల్లించడం.. యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలా లా కళాశాలకు బీసీఐ అనుమతి ఇవ్వలేదని వివిధ విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. అనుమతి వచ్చేలా చేయాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్‌ చేస్తున్నారు.

ప్రవేశాలకు వెబ్‌ ఆప్షన్లు షురూ..

రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల పరిధిలో ఈ విద్యాసంవత్సరంలో మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ ఇటీవల పూర్తయింది. వెబ్‌ ఆప్షన్లు మంగళవారం నుంచి మొదలైంది. బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా విడుదల చేసిన జాబితాలో కేయూ లా కళాశాల పేరు లేదు. కాబట్టి మొదటిదశ కౌన్సిలింగ్‌లో కేయూ లా కాలేజీకి వెబ్‌ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం లేకుండాపోయింది. మూడేళ్ల లా కోర్సులో 60 సీట్లు, ఐదేళ్ల లా కోర్సులో 60 సీట్లు ఉన్నాయి. లాసెట్‌లో ఉత్తీర్ణతలో మెరిట్‌ వచ్చిన వారు సాధారణంగా వర్సిటీ లా కాలేజీలో ప్రవేశాలు పొందాలనుకుంటారు.. అలాంటి వారికి నిరాశే ఎదురైంది. రెండోదశ ప్రవేశాలవరకైనా అనుమతివస్తుందా లేదా అనేది వేచి చూడాల్సిందే.

అనుమతి వస్తుందని భావిస్తున్నాం

కేయూ లా కాలేజీకి బార్‌కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా నుంచి అప్లియేషన్‌ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం. చెల్లించాల్సిన ఫీజులు చెల్లించడంతోపాటుగా అఫిడెవిట్‌ను సబ్‌మిట్‌ చేశాం. ఒకటి, రెండ్రోజుల్లో అనుమతి రావొచ్చని భావిస్తున్నాం. రెగ్యులర్‌ అధ్యాపకులు లేరని పేర్కొంటున్నారని సమాచారం ..అయితే ప్రొఫెసర్లను ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. అడ్మిషన్లకు సంబంధించి వెబ్‌ ఆప్షన్ల గడువును కూడా పెంచాలని అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

\- డాక్టర్‌ సుదర్శన్‌, కేయూ లా కాలేజీ ప్రిన్సిపాల్‌

రాజీనామా చేయాలి

రాష్ట్రంలోని లా కాలేజీల్లో ప్రవేశాలకు వెబ్‌ ఆప్షన్లు మంగళవారం ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఏడాది ప్రవేశాలకు బార్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా (బీసీఐ) కేయూ లా కాలేజీకి అనుమతి ఇవ్వలేదని అందుకు బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌, లా కాలేజీ ప్రిన్సిపాల్‌, బీఓఎస్‌, డీన్‌ ఆయా పదవులకు రాజీనామాలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్‌, పీడీఎస్‌యూ హనుమకొండ నగర అధ్యక్షుడు రంజిత్‌ డిమాండ్‌ చేశారు. బీసీఐ విడుదల చేసిన జాబితాలో యూనివర్సిటీ లా కాలేజీ లేకపోవడంతో ఆయా విద్యార్థి సంఘాల బాధ్యులు మంగళవారం కేయూ రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి వద్దకు వెళ్లి వాగ్వాదానికి దిగారు. యూనివర్సిటీ అధికారులు, ప్రిన్సిపాల్‌ నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా అనుమతి వచ్చేలా కృషిచేయాలని వారు డిమాండ్‌ చేశారు.న్యాయ కళాశాల విద్యార్థులు అరుణ్‌, రాకేష్‌, ఉదయ్‌, వంశీ తదితరులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్‌తో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు

‘హైడ్రా’ పేరిట హైడ్రామా

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌

కమలాపూర్‌: ప్రజా సమస్యలు, రుణమాఫీ చర్చ జరగకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ‘హైడ్రా’ పేరిట హైడ్రామా నడుపుతున్నాడని మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ సీనియర్‌ నేత ఈటల రాజేందర్‌ ఆరోపించారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తర్వాత మొదటిసారి కమలాపూర్‌ మండలానికి వచ్చిన ఈటలకు మంగళవారం స్థానిక బీజేపీ శ్రేణులు, అభిమానులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలుకగా విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ నుంచి తన నివాసానికి భారీ ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 50 శాతం మందికి కూడా రుణమాఫీ జరగలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు 65 లక్షల మంది రైతులు ఉన్నారని, రూ.48 వేల కోట్లు రుణమాఫీకి ఖర్చు అవుతుందని చెప్పారని, ఇప్పుడు 45 లక్షల మంది రైతులు ఉన్నారని, రూ.34 వేల కోట్లు సరిపోతుందని చెప్పి చివరకు రూ.31 వేల కోట్లు అని తేల్చి, ఇప్పటివరకు కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. 2021 లో దళితబంధు పేరిట చిన్నచిన్న షాపులు పెట్టుకున్న వారికి రూ. 3, 4 లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఆపారని, రెండో విడత డబ్బులు రావాలంటే బీఆర్‌ఎస్‌ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని అబద్ధపు మాటలు చెప్పి బీఆర్‌ఎస్‌ పార్టీ దళిత జాతిని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం హుజూరాబాద్‌ నియోజకవర్గంలో రెండో విడత దళితబంధు పథకం రాని వారందరికీ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. సెప్టెంబర్‌ 1 నుంచి 2 నెలల పాటు పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందని, ప్రతీ కార్యకర్త, నాయకుడు చిన్నా, పెద్ద తేడా లేకుండా ఇంటింటికి వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు. మాడ గౌతంరెడ్డి, కట్కూరి అశోక్‌రెడ్డి, కొండం శ్రీనివాస్‌, ఇనుగాల రత్నాకర్‌, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

ఒద్దిరాజు సోదరులకు గుర్తింపు రాలేదు

- ఐజేయూ జాతీయ కార్యదర్శి దేవులపల్లి అమర్‌

కేసముద్రం : తెనుగు పత్రికను స్థాపించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ఒద్దిరాజు సోదరులకు తగిన గుర్తింపు రాలేదని సీనియర్‌ జర్నలిస్ట్‌, ఐజేయూ జాతీయ కార్యదర్శి దేవులపల్లి అమర్‌ అన్నారు. ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో ఒద్దిరాజు చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఒద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు స్థాపించిన తెనుగు పత్రిక శతాబ్ది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఇనుగుర్తిలో ఒద్దిరాజు సోదరులు ముద్రణాలయం ఏర్పాటు చేసి, పత్రికను ముద్రించి ఇతర ప్రాంతాలకు సర్క్యులేషన్‌ చేస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. హైదరాబాద్‌ ట్యాంక్‌బండ్‌పై ఒద్దిరాజు సోదరుల విగ్రహాల ఏర్పాటుకు కృషి చేయాలని, అలాగే మహబూబాబాద్‌ జిల్లాకు వారి పేరు పెట్టే అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరారు. మీడియా ఎడ్యుకేషన్‌ ఫౌండేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఒద్దిరాజు సోదరుల చరిత్రను చేరుస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.గాయత్రి గ్రానైట్స్‌ అధినేత వద్దిరాజు కిషన్‌, ట్రస్ట్‌ చైర్మన్‌ సుభాష్‌చంద్ర, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవులపల్లి అమర్‌

నూతన వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం

- నాబార్డు సీజీఎం చింతల సుశీల

ఐనవోలు: వాతావరణ పరిస్థితులను తట్టుకుని, నూతన వ్యవసాయ సాగు పద్ధతులను ప్రోత్సాహిస్తున్నట్లు నాబార్డు సీజీఎం చింతల సుశీల తెలిపారు. తెలంగాణ వాతావరణ మార్పు నిధి–వడ్డీ భేదం కింద వరంగల్‌, హనుమకొండ జిల్లాలో నాబార్డు మద్దతు ఉన్న మూడు రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్‌పీఓ)కు పైలెట్‌ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు నాబార్డు సుశీల చెప్పారు. మంగళవారం మండలంలోని రాంనగర్‌ రైతు వేదిక వద్ద పైలెట్‌ ప్రాజెక్టు కింద మంజూరైన డ్రోన్లను సీజీఎం సుశీల, టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ఎఫ్‌పీఓ సభ్యులకు పంపిణీ చేసి ప్రాజెక్టును ప్రారభించి ఆమె మాట్లాడారు. టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పంటలకు పిచికారీ చేసే డ్రోన్స్‌ పంపిణీ చేయడం వల్ల ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. అంతకు ముందు నాబార్డ్‌ సీజీఎం సుశీల ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నందనం బ్యాంక్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన మొబైల్‌ ఏటీఎంను ఆమె ప్రారంభించారు. నాబార్డ్‌ డీజీఎం స్వాతి తివారి, డీడీఎం చంద్ర శేఖర్‌, ప్రతాపరెడ్డి, ఏడీ ఉమారెడ్డి, సీసీఎక్స్‌ సీఈఓ నీరజ్‌, రాజేశ్వర్‌, డీసీసీబీ సీఈఓ వజీర్‌ సుల్తాన్‌, తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌ను ప్రారంభిస్తున్న నాబార్డ్‌ సీజీఎం సుశీల, టెస్కాబ్‌ చైర్మన్‌ మార్నేని రవీందర్‌

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కుక్టా జాక్‌ కో కన్వీనర్‌ డాక్టర్‌ సాధు రాజేశ్‌

కేయూ క్యాంపస్‌ : రాష్ట్రంలోని ఆయా యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కుక్టా జాక్‌ కన్వీనర్‌ డాక్టర్‌ సాధు రాజేశ్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కుక్టా జాక్‌ బాధ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. 1,445 మంది ఏళ్ల తరబడి కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారని వివరించారు. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లకు యూజీసీ పే స్కేల్స్‌ వర్తింపచేయాలని డిమాండ్‌ చేశారు. తెలంగాణ వస్తే తమఉద్యోగాలు పర్మనెంట్‌ అవుతాయనే ఆశతో ఉన్నారని తెలంగాణ వచ్చిన తర్వాత కూడా గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాంట్రాక్టు అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. 15 రోజుల్లో వీసీలను నియమిస్తామని సీఎం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో జాక్‌ బాధ్యులు డాక్టర్‌ ఫిరోజ్‌ పాషా, మాదాసి కనకయ్య, మామిడి లింగయ్య, లక్ష్మారెడ్డి, జూల సత్య, చందులాల్‌, రాజు, సునీత, రాజేశ్వరి, డి.శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధు రాజేశ్‌

కాంట్రాక్టు ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌ చేయాలి

రాష్ట్రంలోని యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ప్రొఫెసర్లను రెగ్యులరైజ్‌ చేయాలని తెలంగాణ ఆల్‌ యూనివర్సిటీస్‌ కాంట్రాక్టు టీచర్స్‌ జేఏసీ చైర్మన్‌ డాక్టర్‌ శ్రీధర్‌ కుమార్‌లోథ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అసోసియేషన్‌ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో తూర్పాటి వెంకటేష్‌, సంతీత్‌కుమార్‌, శశిధర్‌, సాయితరుణ్‌, సుకన్య, బ్లెస్సీ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

మక్కలు @రూ.2,885



వరంగల్‌ : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న క్వింటాకు రూ.2,885గా ధర పలికింది. హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రానికి చెందిన రైతు బరిగెల సంజీవ్‌ సుమారు 30 క్వింటాళ్ల మొక్కజొన్నలు విక్రయానికి మార్కెట్‌కు తీసుకరాగా ప్రేమ్‌ అడ్తి షాపు ద్వారా సంధ్య ట్రేడర్స్‌ కొనుగోలు చేసినట్లు మార్కెట్‌ అధికారులు తెలిపారు.

సైబర్‌ నేరగాళ్ల ఘరానా మోసం

- వ్యాపారిని బెదిరించి రూ.88 వేలు కాజేసిన కేటుగాళ్లు

పాలకుర్తి టౌన్‌ : సైబర్‌ నేరస్తుల ఉచ్చులో పడి జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి మోసపోయాడు. పోలీసులమని చెబుతూ..అమెరికాలోని మీ కుమారుడు కారుతో ఒకరికి యాక్సిడెంట్‌ చేశాడని, గాయపడిన వారికి చికిత్స చేయాల్సి ఉందని చెప్పారు. కేసు కాకుండా చూసుకుంటామని, వెంటనే రూ.3 లక్షలు పంపాలని బెదిరించారు. ఆందోళనకు గురైన బాధితుడు ‘నేను కనుక్కొని డబ్బులు పంపుతా’నని తెలిపిన సైబర్‌ నేరగాళ్లు వినలేదు. మూడు గంటల పాటు బాధితుడితో కాల్‌లోనే ఉండి సతాయించారు. డబ్బులు పంపకుంటే మీ కుమారుడిని కాల్చివేస్తామని హెచ్చరించారు. కుమారుడు మాట్లాడినట్లుగా ఓ రికార్డును బాధితుడికి వినిపించగా నిజమే అనుకోని వెంటనే రూ.88వేలు ట్రాన్స్‌ఫర్‌ చేశాడు. అనంతరం కాల్‌ కట్‌ చేసి అమెరికాలో ఉన్న తన కుమారుడికి ఫోన్‌ చేయగా యాక్సిడెంట్‌ చేయలేదని చెప్పడంతో మోసపోయనని బాధితుడు గుర్తించాడు. ఈఘటనపై స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. మండలంలో 10 మందికి సైతం సైబర్‌ నేరగాళ్లు 92 సిరీస్‌ నుంచి కాల్స్‌ వచ్చినట్లు సమాచారం.

హలో నేను ఏసీబీ ఇన్‌స్పెక్టర్‌ను..

- మత్స్యశాఖ అధికారి నరేశ్‌కుమార్‌ నాయుడికి ఫేక్‌ ఫోన్‌కాల్‌
- అక్రమ ఆస్తులున్నాయని ఫిర్యాదు వచ్చింది.. రూ.3 లక్షలు ఇచ్చి సెటిల్‌ చేసుకోండని బెదిరింపు
- సుబేదారి పోలీసులకు అధికారి ఫిర్యాదు

గీసుకొండ : ‘హలో నా పేరు నాయుడిగారి సురేంద్రకుమార్‌..హైదరాబాద్‌ ఏసీబీ హెడ్‌ ఆఫీసులో ఎంక్వయిరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నా.. మీరు అక్రమంగా ఆస్తులు కూడగట్టారని ఫిర్యాదులు వచ్చాయి.. విచారణ కూడా అయిపోయింది. దాడులకు పంపుతున్నా.. ఏదైనా సెటిల్‌ చేసుకోండి.. రూ.3 లక్షలు ఇస్తే మీపైన చర్యలు ఉండవు. లేదంటే బ్లాక్‌లిస్టులో పెడతా’ అంటూ సోమవారం మత్స్యశాఖ అధికారి నరేశ్‌కుమార్‌ నాయుడికి ఫేక్‌ ఫోన్‌ కాల్‌ వచ్చింది. నరేశ్‌కుమార్‌ నాయుడు ఇటీవల వరంగల్‌ నుంచి పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన ఇంకా వరంగల్‌లోనే పని చేస్తున్నాడని భావించి కాల్‌ చేయడంతో అతడి కాల్‌ను అధికారి రికార్డు చేశారు. దీనిపై ఏసీబీ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన ఫోన్‌ను కట్‌ చేయకుండా హోల్డ్‌లో పెట్టకుండా తక్షణమే డబ్బు ఫోన్‌ పే ద్వారా పంపించాలని సదరు వ్యక్తి కోరగా అంత మొత్తం తన వద్ద లేదని ఒక గంట సమయం ఇస్తే రూ.లక్ష చెల్లిస్తానని నరేశ్‌కుమార్‌ నాయుడు చెప్పడంతో అతడు సంతృప్తి చెందకుండా మీ పేరును బ్లాక్‌ లిస్టులో పెడుతున్నాని కాల్‌కట్‌ చేశాడు. ఇలా మత్స్యశాఖకు సంబంధించి పలు జిల్లాలకు చెందిన ఎనిమిది మంది మత్స్యశాఖ అధికారులకు సదరు వ్యక్తి కాల్‌ చేసినట్లు నరేశ్‌కుమార్‌ నాయుడు తెలిపారు. తనకు కాల్‌ రాగానే కట్‌ చేయడంతో సదరు వ్యక్తి మళ్లీ ఫోన్‌ చేశాడని. అనుమానం వచ్చి రికార్డు చేశానని, ఈ విషయమై ఏసీబీ అధికారులు తనతో మాట్లాడారని, మంగళవారం సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని ఆయన సాక్షితో తెలిపారు. ఇటీవల మహబూబాబాద్‌ నుంచి వరంగల్‌కు బదిలీపై వచ్చిన జిల్లా మత్స్యశాఖ అధికారి నాగమణికి ఇదే తరహాలో సదరు వ్యక్తి కాల్‌ చేసి డబ్బులు డిమాండ్‌ చేశాడని చెబుతున్నారు. ఇలాంటి ఫేక్‌ కాల్స్‌ను అధికారులు ఎవరూ నమ్మవద్దని, అలాంటివి ఏమైనా వస్తే 1064 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేయాలంటూ హైదరాబాద్‌లోని స్టేట్‌ ఏసీబీ కార్యాలయ అధికారులు ప్రకటనలో తెలిపారు.

బస్సు, బైక్‌ ఢీ..

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో మృతిచెందిన పద్మనాగిరెడ్డి, క్షతగాత్రుడు నరేశ్‌

బయ్యారం: ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్‌ జిల్లా బయ్యారం మండలంలోని నామాలపాడు సమీపంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా ఇల్లందు పట్టణానికి చెందిన జగన్నాథ పద్మనాగిరెడ్డి(32) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు.ఈ క్రమంలో పని నిమిత్తం ఇల్లందుకు చెందిన మరో తాపీమేస్త్రీ భూక్య నరేశ్‌తో కలిసి తన బైక్‌పై మరిపెడకు వెళ్తున్నారు. కాగా మహబూబాబాద్‌ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలం వైపు వెళ్తు ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో పద్మనాగిరెడ్డి, భూక్య నరేష్‌ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు పద్మనాగిరెడ్డి మృతి చెందగా, మెరుగైన వైద్యం కోసం నరేశ్‌ను హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు బయ్యారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష జ్వరంతో వ్యక్తి మృతి



లచ్చిరాం నాయక్‌(ఫైల్‌)

తొర్రూరు రూరల్‌: విష జ్వరంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకటాపురం గ్రామ శివారు కేవులతండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం తండాకు చెందిన బానోత్‌ లచ్చిరాం నాయక్‌ (52) వారంరోజుల క్రితం జ్వరంతో బాధపడుతూ తొర్రూరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించింది. దీంతో రెండురోజుల క్రితం వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి వైద్యం చేస్తుండగా మంగళవారం ఉదయం మృతి చెందాడు. విషపు జ్వరంలో లచ్చిరాంనాయక్‌ మృతి చెందడంతో మృతుడి భార్య, పిల్లలతోపాటు బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

నర్సంపేటలో ఇంటర్‌ విద్యార్థి..



సంకినేని అర్జున్‌(ఫైల్‌)

నర్సంపేట రూరల్‌ : విషజ్వరంతో యువకుడు మృతిచెందిన సంఘటన నర్సంపేట పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. నర్సంపేటలోని 16వ వార్డుకు చెందిన సంకినేని అర్జున్‌ (17) స్థానిక ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ చదువుతున్నాడు. నాలుగురోజుల క్రితం జ్వరం రావడంతో నర్సంపేటలోని పలు ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఇదే విషయమై నర్సంపేట మండలంలోని భానోజీపేట ప్రాథమిక వైద్యాధికారి అరుణ్‌చంద్రను వివరణ కోరగా..నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొంది, చివరకు వరంగల్‌లోని ప్రైవేట్‌ ఆస్పతిలో జ్వరంతోపాటు ఫిట్స్‌ రావడంతో మృతిచెందినట్లు తెలిపారు.

ఫోర్ట్‌రోడ్డులో అగ్ని ప్రమాదం

జయ గన్నీమర్చంట్‌, ఎస్‌.కే ఓల్డ్‌ ఫర్నిచర్‌ షాపుల్లో ఎగిసిపడిన మంటలు

- కాలిబూడిదైన ఓల్డ్‌ ఫర్నిచర్‌, యంత్రాలు, గన్నీబ్యాగులు
- సకాలంలో స్పందించి మంటలను అదుపు చేసిన ఫైరింజన్లు



మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

ఖిలా వరంగల్‌ : వరంగల్‌ ఫోర్ట్‌రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌నా లేదా ఆకతాయిలు కాల్చిపడేసిన సిగరేట్‌ వల్ల అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో జయ గన్నీస్‌ మర్చంట్‌, ఎస్‌.కే ఓల్డ్‌ ఫర్నిచర్‌ షాపుల్లో వేర్వేరుగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలమేర పాత ఫర్నిచర్‌, యంత్రాలు, గన్నీ బ్యాగులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. స్థానికులు, బాధితులు, అధికారుల కథనం ప్రకారం.. వరంగల్‌ ఫోర్ట్‌ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌ శివనగర్‌లో పాత గోదాం, ఖాళీ స్థలంలో వీరెడ్డి(ఉరుటి) వీరస్వామి అతడి కుమారుడు రవి ఇద్దరు కలిసి జయ గన్నీస్‌ మర్చంట్‌ షాపు నిర్వహిస్తున్నారు. అలాగే శాకరాశికుంటకు చెందిన ఎస్‌.కే రబ్బాని అతడి కుమారుడితో కలిసి ఎస్‌.కే ఓల్డ్‌ ఫర్నిచర్‌ షాపును ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారు. రోజు మాదిరిగా సోమవారం రాత్రి యజమానులు షాపులకు తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున జయ గన్నీస్‌ మర్చంట్‌, ఎస్‌.కే ఓల్డ్‌ ఫర్నిచర్‌ షాపులలో ప్రమాదవశాత్తు అగ్గిరాజుకుంది. షార్ట్‌సర్క్యూట్‌ కారణమా లేక మద్యం మత్తులో ఆకతాయిలు కాల్చిపడేసిన సిగరెట్‌ వల్లనా తెలియదు. ఒక్కసారిగా తట్టుబస్తాలు (గన్నీ బ్యాగులు) ఓల్డ్‌ ఫర్నిచర్‌, యంత్రాలకు మంటలు అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మంటలు వేగంగా పక్కనే ఉన్న సాయిశ్రీనివాస గ్లాస్‌, ప్లైవుడ్‌, హార్డ్‌వేర్‌ షాపునకు వ్యాపించాయి. దట్టమైన పొగతో అక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గమనించిన స్థానికులు స్థానిక కార్పొరేటర్‌ దిడ్డి కుమారస్వామి, మిల్స్‌ కాలనీ పోలీసులతోపాటు వరంగల్‌ ఫైర్‌ అధికారులకు వేర్వేరుగా సమాచారం ఇచ్చారు. వరంగల్‌ ఏసీపీ నందిరాం నాయక్‌, ఇన్‌స్పెక్టర్‌ మల్లయ్య, వరంగల్‌, గొర్రెకుంట, హనుమకొండ, వర్ధన్నపేటకు చెందిన అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేందుకు ఫైరింజన్లతో పాటు 15 మంది సిబ్బంది విశ్వప్రయత్నం చేశారు. ఉదయం 4:30 నుంచి 10:30 గంటల వరకు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగనప్పటికీ సుమారు రూ.15లక్షల విలువైన గన్నీ బ్యాగులు, రూ.5లక్షల విలువైన ఓల్డ్‌ ఫర్నిచర్‌, పనిముట్లు, యంత్రాలు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక, పోలీస్‌, రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. సుమారు రూ.30లక్షలకు పైగా ఆస్తి కాలిపోకుండా కాపాడినట్లు వరంగల్‌ అగ్నిమాపక శాఖ డీఎఫ్‌ఓ శ్రీధర్‌రెడ్డి, వరంగల్‌, హనమకొండ ఫైర్‌ అధికారులు రాజశ్వర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి ఆర్థికంగా నష్టపోయి వీధిన పడ్డ వ్యాపారులను ప్రభుత్వం స్పందించి సాయం అందించి ఆదుకోవాలి.

\- నరేందర్‌, మాజీ ఎమ్మెల్యే

అండగా ఉంటాం..

అధైర్య పడొద్దు అండగా ఉంటాం. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు న్యాయం జరిగేలా నివేదికను ప్రభుత్వానికి అందజేయాలని రెవెన్యూ అధికారులను కోరా.

\- కొండా మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ